క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో చండీయాగం



చండీయాగం నిర్వహిస్తున్న వేదపండితులు

విజయనగరం టౌన్: భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి జన్మనక్షత్రమైన మూలానక్షత్రం పురస్కరించుకుని, స్థానిక రైల్వేస్టేషన్ వద్ద ఉన్న వనంగుడిలో చండీయాగం భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు. వేదపండితులు సాయికిరణ్, నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగ్గా, యాగం విశిష్టతను భక్తులకు వారు వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు అమ్మవారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

ఓటరు జాబితాలో తప్పులుంటే తెలియజేయండి



మాట్లాడుతున్న నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నూకరాజు

నెల్లిమర్ల: ఓటరు జాబితాలో తప్పులున్నా, మార్పులు, చేర్పులు కావాలన్నా లిఖితపూర్వకంగా తెలియజేయాలని, వాటిని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మత్స నూకరాజు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నేతలు, నాలుగు మండలాల తహసీల్దార్లతో మంగళవారం సమావేశమైన ఆయన కొత్త ఓటర్ల చేర్పుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందన్నారు. ఇప్పటికే నియోజకవర్గ ఓటర్ల తుది జాబితా విడుదలైందన్నారు. సమావేశంలో తహసీల్దార్లు ధర్మరాజు, శ్యామ్‌ప్రసాద్, ప్రవల్లిక ప్రియ, రామారావు, ఎన్నికల విభాగం డీటీ ఎస్.వి.వి.ఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

రూ.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం



రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ అప్పలనాయుడు

విజయనగరం రూరల్: మండలంలోని బియ్యాలపేట గ్రామంలో రూ.5 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎంపీపీ మామిడి అప్పలనాయుడు మంగళవారం భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని ప్రాంతాల అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని, ఇప్పటికే ప్రతీ సచివాలయం పరిధిలో అభివృద్ధి పనులకు రూ.20 లక్షలు చొప్పున నిధులు మంజూరు చేశారన్నారు. త్వరితగతిన రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేసి, వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ నడిపేన శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు ఎన్.సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యసన సామర్థ్యం పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ అబ్జర్వేటర్లు

గజపతినగరం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలిస్తున్నామని జిల్లా లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ అబ్జర్వేటర్లు రాంబాబు, సన్యాసినాయుడు తెలిపారు.స్థానిక బాలుర హైస్కూల్‌ను మంగళవారం వారు సందర్శించారు. 6,7,8వ తరగతి విద్యార్థులకు పాఠ్యాంశాల్లోని ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. విద్యార్థుల మార్కులు, హాజరు, ఇతర రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సీఆర్పీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తోటపు ఎద్దుకు అంత్యక్రియలు



శివైక్యం చెందిన తోటపుఎద్దుకు పూజలు చేస్తున్న పూజారి

శృంగవరపుకోట: సింహాద్రి అప్పన్న ప్రతిరూపంగా పూజలు అందుకునే ఎస్.కోటకు చెందిన తోటపు ఎద్దు మామిడిపల్లి గ్రామంలో మంగళవారం శివైక్యం చెందింది. మామిడిపల్లి గ్రామస్తులు స్థానిక దాసరి కులస్తులకు సమాచారం అందించారు. దాసరి కులస్తులు పలువురు మేళతాళాలతో ఊరేగింపుగా వెళ్లి తోటపు ఎద్దుకు పూజలు చేసి పానుపు చేశారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- నగరంలో రూ.57 లక్షలతో అభివృద్ధి పనులు
- 25, 33 డివిజన్లలో పలు నిర్మాణాలకు భూమిపూజ
- నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి



కె.ఎల్.పురంలో కొబ్బరికాయ కొట్టి, అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్న నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విజయనగరం: అభివృద్ధి, సంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అన్నారు. నగరంలోని 25, 33వ డివిజన్లలో రూ.16 లక్షల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు ఆమె మంగళవారం భూమిపూజ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్న మాదిరిగానే ఇక్కడ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నగరాభివృద్ధికి పాటుపడుతున్నారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా విజయనగరం కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. నగరవాసులకు మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపట్టడం జరుగుతోందన్నారు. ప్రధానంగా ప్రజల తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టడం జరుగుతోందని, రోజు విడిచి రోజు తాగునీటి పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. రానున్న వేసవి దృష్ట్యా ఎక్కడా తాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నామన్నారు. ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంతో పాటు వార్డు పర్యటనల ద్వారా ప్రజాప్రతినిధులు తెలుసుకున్న సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. వీటితో పాటు నగరాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ఇప్పటికే పలు ప్రధాన జంక్షన్లు సరికొత్త హంగులతో మెరుస్తున్నాయన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న సుపరిపాలన కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీనే మళ్లీ గెలిపించాలని, అలాగే ఇక్కడ ఎమ్మెల్యేగా కోలగట్ల వీరభద్రస్వామిని మరోసారి గెలిపించి, సీఎం జగనన్నకు కానుకగా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జ్ మారం బాలబ్రహ్మరెడ్డి, కార్పొరేటర్ జి.వి.రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం: కోలగట్ల శ్రావణి

విజయనగరం: నగరంలోని 39, 45, 46 డివిజన్ల పరిధిలో రూ.41 లక్షల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మంగళవారం భూమిపూజ చేసి, పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని, ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఎమ్మెల్యే అయినప్పటి నుంచి ప్రతిరోజూ ఏదో ఒకచోట ఏదో ఒక అభివృద్ధి కార్యక్రమం గానీ సంక్షేమ కార్యక్రమం గానీ చేపడుతూనే ఉన్నామన్నారు. ప్రజాసమస్యల పరిష్కారమే ప్రధానంగా పనులు చేపట్టడం జరుగుతోందన్నారు.



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న నగర మేయర్ విజయలక్ష్మి

ఎప్పుడూ లేనంతగా నగరంలో ప్రస్తుతం అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. నగరవాసుల మౌలిక సదుపాయాలకు, రోడ్ల విస్తరణకు నిత్యం చర్యలు చేపడుతున్నామన్నారు. దీంతో ఎన్నో ఏళ్ల నాటి అంబటి సత్రం కొత్తపేట రోడ్డుకు మోక్షం కలిగిందన్నారు. అన్ని ప్రాంతాలు బాగుండాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తపని అని, ఆయన చొరవతో నగరాభివృద్ధి శరవేగంగా జరుగుతోందన్నారు. మరింత అభివృద్ధి, సంక్షేమం కావాలంటే రానున్న సార్వత్రిక ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీనే మళ్లీ గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ తాళ్లపూడి సంతోషి, తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల నిరోధానికి చర్యలు

- మున్సిపల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు



సదస్సుకు హాజరైన ఐసీడీఎస్ సిబ్బంది, మహిళా పోలీసులు



మహిళల సంరక్షణ చర్యలపై సూచనలిస్తున్న మున్సిపల్ కమిషనర్ మల్లయ్యనాయుడు

విజయనగరం: పనిచేసే చోట మహిళలపై లైంగిక వేధింపులు జరగకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు సూచించారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో విజయనగరం అర్బన్ ఐసీడీఎస్ పీవో ప్రసన్న ఆధ్వర్యంలో నియోజకవర్గ పరిధిలోని మహిళా సంరక్షణ కార్యదర్శులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని, కాసేపు మాట్లాడారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, నర్సింగ్ హోమ్‌లు, క్రీడా సంస్థలు, సహకార సంస్థలు, పరిశ్రమల్లో సఖి గ్రూపులు ఏర్పాటు చేయాలని తెలిపారు. అలాగే గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌లపై అవగాహన కల్పించాలన్నారు. పీవో ప్రసన్న మాట్లాడుతూ ఎవరైనా పని ప్రదేశంలో లైంగిక వేధింపుల బారినపడితే అటువంటి వారు రక్షణ పొందేందుకు ప్రత్యేకంగా చట్టాలు ఉన్నాయన్నారు. ఈ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. దీనికోసం మహిళా పోలీసులు సమర్థవంతంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ తిరుమలరావు, వన్‌స్టాప్ సెంటర్ ప్రతినిధులు రమాదేవి, వెంకటలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలి

- డిప్యూటీ డీఈవో కంది వాసుదేవరావు



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో వాసుదేవరావు

నెల్లిమర్ల: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించేలా విద్యాబోధన చేయాలని డిప్యూటీ డీఈవో కంది వాసుదేవరావు సూచించారు. స్థానిక పట్టణంలోని కేజీబీవీ(కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయం)ని జిల్లా విద్యాశాఖ మోనటరింగ్ బృందంతో కలిసి మంగళవారం సందర్శించిన ఆయన ఉపాధ్యాయులు, విద్యార్థులతో వేర్వేరుగా సమావేశమై, ఉపాధ్యాయుల బోధనాతీరు, విద్యార్థుల విద్యాసామర్థ్యాలపై ఆరాతీశారు. ప్రతీ విద్యార్థి విద్యాప్రగతిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. తెలుగు, ఇంగ్లిష్, హిందీ క్షుణ్ణంగా చదవడం, రాయడం నేర్పించాలన్నారు. లెస్సన్ ప్లాన్, కృత్యాల ద్వారా బోధించి, విద్యార్థుల్లో అభ్యసన స్థాయిలను పెంచాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.తిరుపతి నాయుడు, డైట్ కళాశాల అధ్యాపకులు శ్రీనివాస్, సూర్యారావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాలను సందర్శించాలి



పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ దీపిక

గంట్యాడ: సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా సమస్యాత్మక గ్రామాలను, పోలింగ్ కేంద్రాలను సందర్శించాలని పోలీసులను ఎస్పీ ఎం.దీపిక ఆదేశించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఆమె ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈసందర్భంగా పోలీస్ అధికారులతో మాట్లాడుతూ ఎన్నికల సమయాల్లో సమస్యలు సృష్టించే వ్యక్తులను గ్రామాల్లో గుర్తించి పార్టీలకతీతంగా బైండోవర్ చేయాలని చెప్పారు. వారి నుంచి తహసీల్దార్ కార్యాలయంలో మంచి ప్రవర్తన కోసం బాండులు తీసుకోవాలన్నారు. ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించేందుకు గ్రామాల్లో ప్రజలతో సమావేశాలు నిర్వహించాలని, అసాంఘిక కార్యకలాపాల సమాచారం తక్షణమే పోలీసులకు అందేలా నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఎస్పీ వెంట విజయనగరం రూరల్ సీఐ ఎం.శ్రీనివాసరావు, ఎస్‌ఐ సురేంద్ర నాయుడు ఉన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తులాహ్వానం

చీపురుపల్లి: స్థానిక బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకులంలో 2024–25 విద్యా సంవత్సరంలో 5వ తరగతి, ఇంటర్మీడియట్(ఇంగ్లిష్ మీడియం)లో ప్రవేశాలకు అర్హత కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఏ.రాణిశ్రీ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 5వతరగతి, ఇంటర్మీడియట్‌లో 80 చొప్పున సీట్లు ఉన్నాయని, వీటిలో ఎస్సీలకు 60, బీసీ–సి వారికి 10, ఎస్టీలకు 5, బీసీ 4, ఓసీలకు ఒక సీటు కేటాయించినట్లు పేర్కొన్నారు. ప్రవేశ పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు. 5వ తరగతిలో ప్రవేశానికి ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరంలో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థినులు, ఇంటర్మీడియట్ ప్రవేశ పరీక్ష రాయాలనుకునే విద్యార్థినులు 2023–24 విద్యా సంవత్సరంలో గుర్తింపు పొందిన పాఠశాలలో పదోతరగతి చదివి ఉండాలని వివరించారు. ఈనెల 23లోగా హెచ్‌టీటీపీఎస్://ఏపీజీపీసీఈటీ.ఏపీసీఎఫ్‌ఎస్‌ఎస్.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మార్చి10న ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 5వ తరగతి ప్రవేశ పరీక్ష, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఇంటర్మీడియట్ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు 99493 56322, 93477 45277 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

వియ్యంపేట గురుకులంలో..

కొత్తవలస: మండలంలోని వియ్యంపేట బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకులంలో 2024–25 విద్యా సంవత్సరంలో 5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టి.జయశ్రీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థినులు ఈనెల 23వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మార్చి 10వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.

పవర్ ప్లాంట్ సందర్శన

విజయనగరం అర్బన్: క్షేత్రపర్యటనలో భాగంగా నగరంలోని ది సన్ స్కూల్ పదో తరగతి విద్యార్థులు జిల్లాలోని జిందాల్ పవర్ ప్లాంట్‌ను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు విద్యుత్ ఉత్పత్తి తదితర అంశాలను ప్రత్యక్షంగా చూసి, తెలుసుకున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నెల్లిమర్ల: మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.ఉషారాణి ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. ఐదో తరగతిలో ఇంగ్లిష్ మీడియంలో చేరేందుకు గుర్తింపు పొందిన ప్రభుత్వ పాఠశాలలో 3, 4 తరగతులు చదివి, వార్షిక ఆదాయం రూ.లక్షకు మించకుండా ఉండని వారు అర్హులన్నారు. ఇంటర్మీడియట్ సీఈసీ ఇంగ్లిష్ మీడియంలో 80 సీట్ల భర్తీకి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ నెల 23వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని, మార్చి 10వ తేదీన పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారంతా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

అనవసర యాప్‌లు రద్దు చేయాలి

విజయనగరం అర్బన్: ఉపాధ్యాయులకు అనవసరమైన యాప్‌లను రద్దు చేయాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం(ఎస్‌టీయూ) జిల్లా కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఇదే విషయమై వారు స్థానిక అమర్ భవన్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో 60 ఏళ్లు దాటిన ఉపాధ్యాయులు, గర్భిణులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారికి ఎన్నికల విధుల్లో మినహాయింపు ఇవ్వాలని కోరారు. సమావేశంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శ్యామ్, సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.జోగారావు తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన



ర్యాలీ చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు, విద్యార్థులు

శృంగవరపుకోట: ఆర్టీసీ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా స్థానిక ఆర్టీసీ డిపో ఉద్యోగులు, విద్యార్థులతో కలిసి పట్టణంలో మంగళ వారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ ఉద్యోగులు మాట్లాడుతూ రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. డీఎం కె.రమేష్, డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వేణు, ట్రాఫిక్ సూపరింటెండెంట్ వెంకటరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



చామలాదేవి పాఠశాలలో విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షిస్తున్న ఎంఈవో బాలభాస్కరరావు

వేపాడ: చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంఈవో బాలభాస్కరరావు ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని వావిలపాడు, చామలాదేవి అగ్రహారం ప్రాథమిక పాఠశాలలను మంగళవారం సందర్శించారు. విద్యార్థులతో ఇంగ్లిష్ పదాలు చదివించి, రాయించారు. విద్యార్థుల వర్కు బుక్స్, టీచర్ల లెసన్ ప్లాన్, మధ్యాహ్న భోజనాలను పరిశీలించారు. అనంతరం నీల కంఠరాజపురం హైస్కూల్ లో నిర్వహిస్తున్న లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాంను(ఎల్ఈపీ) పరిశీలించి, ఉపాధ్యాయులతో సమావేశ మయ్యారు. పదోతరగతి పబ్లిక్ పరీక్ష ల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులను సన్నద్ధం చేయాలని సూచించారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

- జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు



డెంకాడ: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సందర్శిస్తున్న ఎంపీపీ వాసుదేవరావు



విజయనగరం రూరల్: ఆరోగ్యశ్రీ కార్డుల ప్రాధాన్యతను వివరిస్తున్న ఎంపీపీ అప్పలనాయుడు



నెల్లిమర్ల రూరల్: గుషినిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో రామారావు తదితరులు

డెంకాడ: ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలనే సదుద్దేశ్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తోందని ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు అన్నారు. మండలంలోని పితాడివాడ గ్రామంలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించి, అక్కడి రోగులకు అందిస్తున్న వైద్యసేవలు పరిశీలించారు. శిబిరానికి వస్తున్న వారిని ఆప్యాయంగా పలకరిస్తూ వారికి కావాల్సిన సేవలను అందివ్వాలన్నారు. ప్రజలు కూడా ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా వైద్యులు రోగులకు ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లెంక లక్ష్మణరావు, ఎంపీటీసీ సభ్యుడు విజినిగిరి అచ్చునాయుడు, వైద్యులు ఎం.శివరామకృష్ణ, రాజ్‌కుమార్, ఎం.గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం రూరల్: మండలంలోని బియ్యాలపేటలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని విజయనగరం ఎంపీపీ మామిడి అప్పలనాయుడు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన శిబిరానికి వస్తున్న వారికి మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులకు సూచించారు. అనంతరం ప్రభుత్వం కొత్తగా ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా వైద్యసేవల వ్యయ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచిన విషయాన్ని అక్కడి రోగులకు తెలియజేశారు. ప్రజారోగ్యమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని, 104, 108 అంబులెన్స్ సేవలతో పాటు గ్రామాల్లో హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు, ఫ్యామిలీ డాక్టర్ విధానం, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

590 మందికి ఆరోగ్య తనిఖీలు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని గుషిణి సచివాలయం పరిధిలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. వివిధ సమస్యలతో బాధపడుతున్న 590 మంది ఈ శిబిరానికి వచ్చి, తనిఖీలు చేయించుకున్నారు. సతివాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది వీరికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. కంటి సమస్యలతో బాధపడుతున్న పలువురికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామారావు, ఈవోపీఆర్‌డీ సింహాద్రి, ఎంఈవో యూఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

నగర పరిశుభ్రతే లక్ష్యం కావాలి

- మున్సిపల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు



ప్రజారోగ్య సిబ్బందితో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ మల్లయ్యనాయుడు

విజయనగరం: నగర పరిశుభ్రతే లక్ష్యం కావాలని, ఆ దిశగా ప్రజారోగ్య సిబ్బంది సేవలందించాలని మున్సిపల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు సూచించారు. నగరంలోని పారిశుద్ధ్య వాహనాల డిపోను ఆయన మంగళవారం సందర్శించి, అక్కడి ప్రజారోగ్య విభాగం సిబ్బందితో కాసేపు మాట్లాడారు. నగరంలో ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం ఉండకుండా చూడాలని, ప్రజలకు కూడా పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతిరోజూ ఉదయం 6 గంటలకు డివిజన్లకు పారిశుద్ధ్య వాహనాలు తరలించి, చెత్తను సేకరించి, డంపింగ్‌యార్డుకు తరలించాలన్నారు. మరమ్మతులకు గురైన వాహనాలు, పరికరాల వివరాలు అందివ్వాలన్నారు. దీనికోసం ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామన్నారు. ప్రధాన రోడ్లు, వీధులు, జంక్షలు, జనావాసాలు అపరిశుభ్రంగా ఉండకుండా చూడాలన్నారు. ప్రతిరోజూ పారిశుద్ధ్య చర్యలు చేపట్టి, నగర పరిశుభ్రతకు పాటుపడాలన్నారు. వీధులు పరిశుభ్రంగా ఉండేలా చూడాల్సిన బాధ్య త ఆయా శానిటరీ కార్యదర్శులదేనన్నారు. ప్రజలు కూడా నగర పరిశుభ్రతకు సహకరించాలని కోరా రు. కార్యక్రమంలో పారిశుద్ధ్య పర్యవేక్షకుడు బాలకృష్ణ, ప్రజారోగ్య విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న పీఎల్‌పీయూఎస్ చైర్మన్ దుర్గయ్య

గంట్యాడ: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రజోపయోగ సేవల శాశ్వత లోక్ అదాలత్ (పీఎల్‌పీయూఎస్) చైర్మన్ గరికిన దుర్గయ్య అన్నారు. మండలంలోని కొఠారుబిల్లి గ్రామంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్‌లను ఆశ్రయించాలని చెప్పారు. ప్రజోపయోగసేవల్లో ఏమైనా నష్టం జరిగితే ప్రజలు శాశ్వతలోక్ అదాలత్‌ను ఆశ్రయించవచ్చని చెప్పారు. సెషన్స్ కేసులో ఉన్న ముద్దాయిలకు బెయిల్, కేసుల విచారణ కోసం లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌ను సంప్రదించాలని చెప్పారు. తహసీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి మాట్లాడుతూ జనన, మరణధ్రువీకరణ పత్రాల కోసం సకాలంలో దరఖాస్తు చేసుకోవాలని, వివాహాలను రిజిస్టర్ చేయించుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి జగదీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌ల పదవీకాలం పొడిగింపు

బొండపల్లి: మండలంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల త్రిసభ్య కమిటీ చైర్మన్‌ల పదవీకాలాన్ని మరో ఆరునెలలు పాటు పొడిగిస్తూ రాష్ట్ర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కమిషనర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.బొండపల్లి, గొట్లాం, రాచకిండాం పీఏసీఎస్‌ల చైర్మన్‌గా బుద్దరాజు వెంకటప్రభుజీరాజు, మహంతి రమణ, గొల్లు సతీష్‌తో పాటు ఇద్దరు చొప్పున సభ్యులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈఏడాది జూలై 30వ తేదీ వరకు వీరు పదవుల్లో కొనసాగనున్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



గుడివాడ గ్రామంలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రమేష్‌నాయుడు

మెంటాడ (గజపతినగరం రూరల్): గజపతినగరం మండల కేంద్రంతో పాటు గుడివాడ, తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ రమేష్‌నాయుడు మంగళవారం సందర్శించారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, ఫర్నీచర్, ర్యాంపులు, సైన్ బోర్డులను పరిశీలించారు. ఈసందర్భంగా అంతకుముందు తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయపార్టీల నాయకులతో ఎన్నికల పరిశీలన అధికారి ప్రమీలాగాంధీ, తహసీల్దార్ సమావేశమయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చిన్నారులతో ఎన్నికల ర్యాలీలు, నినాదాలు చేయించకూడదన్నారు. అనుమతులు లేకుండా ధర్నాలు, ర్యాలీలు చేపట్టకూడదని సూచించారు.